

జీవీఎంసీలో వైసీపీకి భారీ షాక్

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం

- పది స్థానాలను కైవశం చేసుకున్న అభ్యర్థులు
- బలానికి మించి అభ్యర్థులకు పోలైన ఓట్లు
- క్రాస్ ఓటింగ్ చేసిన వైసీపీ కార్పొరేటర్లు
- ఫలించని వైవీ సుబ్బారెడ్డి బుజ్జగింపులు
- 14 బ్యాలెట్ పేపర్లపై రహస్యకోడ్‌లు వేశారని వైసీపీ అభ్యంతరం
- వాటిని చెల్లని ఓట్లుగా ప్రకటించాలంటూ ఆందోళన
- నిబంధనల ప్రకారం వీలుకాదని కమిషనర్ వివరణ
- జీవీఎంసీ వద్ద కూటమి నేతల సంబరాలు


స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన కూటమి నేతలతో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఇతర నేతలు

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి భారీషాక్ తగిలింది. బుధవారం జరిగిన ఎన్నికల్లో పది స్థానాలను కూటమి మద్దతుతో పోటీచేసిన టీడీపీ అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేశారు. వాస్తవంగా కూటమికి ఉన్న బలానికి మించి ఓట్లు పడడం విశేషం. కొందరు వైసీపీ కార్పొరేటర్లు తమపార్టీ అభ్యర్థులకు కాకుండా కూటమి అభ్యర్థులకు ఓటేయడం వైసీపీ నేతలను మరింత నిరాశకు గురిచేసింది.

విజేతలకు లభించిన ఓట్లు		
వ.నం	పేరు	లభించిన ఓట్లు
1.	విల్లూరి భాస్కరరావు	66
2.	గొలగాని వీరారావు	65
3.	పిసిని వరాహలక్ష్మీనరసింహం	65
4.	గల్లా పోలిపల్లి	64
5.	బొమ్మిడి రమణ	64
6.	బల్ల శ్రీనివాసరావు	60
7.	శరగడం రాజశేఖర్	60
8.	నొల్లి నూకరత్న	58
9.	పులి లక్ష్మీబాయి	56
10.	పిల్లా మంగమ్మ	54

జీవీఎంసీ కౌన్సిల్ ఏర్పడిన తర్వాత మూడుసార్లు స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరగ్గా, వైసీపీ క్లీన్‌స్వీప్ చేస్తూ వచ్చింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడంతో జీవీఎంసీలో సమీకరణాలు మారిపోయాయి. జీవీఎంసీలో మొత్తం 98 మంది కార్పొరేటర్లగానూ వైసీపీ నుంచి 21వ వార్డు కార్పొరేటర్‌గా గెలిచిన వంశీకృష్ణ శ్రీనివాస్ తన పదవికి, వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. దీంతో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు మాత్రమే ఉన్నారు. పాత స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవీకాలం గత నెలతో ముగియడంతో కొత్తగా కమిటీని ఎన్నుకునేందుకు గతనెల 22న నోటిఫికేషన్ విడుదల చేశారు. కూటమి తరపున పది మంది, వైసీపీ నుంచి పది మంది పోటీకి నిలిచారు. నోటిఫికేషన్ విడుదలైన సమయానికి టీడీపీకి 31, జనసేనకు ఐదు, బీజేపీకి ఒకరు మొత్తంగా కూటమికి 37 మంది కార్పొరేటర్ల బలం ఉండగా.. వైసీపీకి 58 మంది సభ్యుల బలం ఉండేది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత వైసీపీ నుంచి ఆరుగురు టీడీపీలోకి ఐదుగురు జనసేనలోకి చేరిపోయారు. వైసీపీకి ఇంతకాలం మద్దతుగా నిలిచిన ఇండిపెండెంట్ కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య టీడీపీకి మద్దతు ప్రకటించారు. దీంతో కూటమి బలం 49కి పెరగ్గా, వైసీపీ బలం 47కి తగ్గింది. పోలింగ్‌కు ముందురోజైన మంగళవారం వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి కార్పొరేటర్లతో ఒక హోటల్‌లో క్యాంప్ ఏర్పాటుచేశారు. ఈ క్యాంప్‌నకు నలుగురు కార్పొరేటర్లు డుమ్మా కొట్టడంతో వారంతా కూటమికి మద్దతు ప్రకటిస్తారని వైసీపీ నేతలు అంచనాకు వచ్చారు. బుధవారం పోలింగ్ ... మిగతా 8వ పేజీలో

కూటమి నేతల సంబరాలు

జీవీఎంసీ ఎన్నికలు జరిగిన మూడున్నరేళ్ల తర్వాత తొలిసారి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించడంతో కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో నేతలు, అభిమానులు మిఠాయిలు తినిపించుకున్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా భారీ మెజారిటీతో గెలుపొందినవారికి పూలమాలలు వేసి ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రూప్ ఫొటోలు దిగారు.


గెలుపు సంబరాల్లో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు

సీజనల్ వ్యాధులపై అలర్ట్!

జిల్లాలో స్టాప్ డయేరియా కార్యక్రమం

- అతిసారం, సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాల వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది
- సహాయక చర్యల కోసం ఎపిడమిక్ సెల్ ఏర్పాటు
- 9848364112 నంబరును సంప్రదిస్తే వెంటనే వైద్య సేవలు



డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఎపిడమిక్ సెల్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
ఇటీవల కురిసిన వర్షాలు, ముసురు వాతావరణం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం పొంచివుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కుటుంబ ఆరోగ్య శాఖ ఉత్తర్వుల మేరకు జిల్లాలో ఆగస్టు ఒకటో తేదీ నుంచి స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని అధికారులు అమలు చేస్తున్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు జిల్లాలో అతిసారం, సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలపై వివరాలు సేకరిస్తున్నారు.

జిల్లాలో ఎక్కడైనా వ్యాధులు ప్రబలితే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎపిడమిక్ సెల్‌ను జిల్లా అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లాలో 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 8 కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పరిధిలో క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు జ్వర బాధితుల వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో నాతవరం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో 200లకు పైగా గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో అధికారిక లెక్కల ప్రకారం 45 వేల మంది గిరిజనులు ఉంటున్నారు. వారికి ప్రతి ఏడాది సీజనల్ వ్యాధులు పట్టి పీడిస్తున్నాయి. జిల్లాలో గత జూన్ నెలలో 12,188 మందికి, అదేవిధంగా జూలై నెలలో 13,592 మందికి వైరల్ జ్వరాలు సోకాయి. ప్రస్తుతం జిల్లాలో పలు గ్రామాల్లో జ్వరబాధితులు ఉన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి జ్వర లక్షణాలతో అనేకమంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ వైద్య సేవలు అందించేందుకు ప్రణాళిక అమలు చేస్తోంది.

అనకాపల్లిలో ఎపిడమిక్ సెల్ ఏర్పాటు

జిల్లా కేంద్రం అనకాపల్లిలో డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఎపిడమిక్ సెల్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎక్కడ వ్యాధులు, జ్వరాలు ప్రబలినా వెంటనే ఎపిడమిక్‌కు సమాచారం అందిస్తే తక్షణ వైద్య సేవలు అందేలా చర్యలు చేపడుతున్నారు. ఎపిడపిక్ సెల్ 24 గంటలు పనిచేసేలా ప్రతి రోజూ ఆరుగురు సిబ్బంది విధుల్లో ఉండేలా ఏర్పాట్లు చేశారు. అతిసార, వైరల్ జ్వరాలు ప్రబలిన వెంటనే అత్యవసర వైద్య సేవల కోసం ఫోన్ చేసేందుకు వీలుగా 9848364112ను అందుబాటులో ఉంచారు.

సమాచారం రాగానే వైద్య సేవలు




జిల్లాలో ప్రస్తుతం వ్యాధులు అదుపులో ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా కేంద్రంలో ఎపిడమిక్ సెల్‌ను ఏర్పాటు చేశాం. సీజనల్ వ్యాధులు, అతిసార, వైరల్ జ్వరాలు ప్రబలితే ఎపిడమిక్ సెల్‌కు సమాచారం అందిస్తే వెంటనే ఆయా గ్రామాలకు వైద్య సిబ్బందిని పంపుతాం. అవసరం మేరకు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం.

ఎంఎస్‌వీకే బాలాజీ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, అనకాపల్లి

సెజ్‌లో ఎలక్ట్రానిక్స్ సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు నిల్

ఆయా కోర్సులు చేసిన వారికి సుదూర ప్రాంతాల్లో ఉపాధి

- అమ్మాయిలను దూరప్రాంతాలకు పంపించని తల్లిదండ్రులు
- వైసీపీ పాలనలో ఒక్క పరిశ్రమకు దిక్కు లేదు..



సెజ్ ముఖద్వారం

అచ్యుతాపురం, ఆగస్టు 7: అచ్యుతాపురం సెజ్‌లో ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు లేకపోవడంతో నిరుద్యోగులకు ఉపాధి లేకుండా పోతోంది. ఆయా రంగాల్లో డిప్లొమా, ఇంజనీరింగ్ చేసిన వారికి ఇక్కడ ఉద్యోగావకాశాలు లభించకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు వస్తాయన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

అచ్యుతాపురం సెజ్‌ను 2005 సంవత్సరంలో 15 వేల ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సెజ్‌లో ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, ఫార్మా, ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారాలు ఏర్పాటయ్యాయి. ఈ పరిశ్రమల్లో ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, డిప్లొమా మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్ వంటి కోర్సులు చేసిన అభ్యర్థులకు మాత్రమే ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సెజ్‌లో ఒక్క కొత్త కర్మాగారం కూడా ఏర్పాటు కాలేదు. అలాగే ఇంతవరకు ఈ సెజ్‌లో ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్‌కి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు కాలేదు. దీంతో ఆయా కోర్సులు చేసిన వారికి ఉద్యోగాలు లేకుండా పోయాయి. వీరంతా బెంగళూరు, చెన్నై వంటి సుదూర ప్రాంతాల్లో వచ్చిన అవకాశాల మేరకు ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా ఈ కోర్సులకు బాలికలే ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. వీరు దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇళ్ల వద్దే ఉండిపోతున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేస్తారని, తమకు స్థానికంగా ఉపాధి లభిస్తుందని నిరుద్యోగులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

అమ్మాయిలు ఇంటికే పరిమితమవుతున్నారు..



కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్ కోర్సులు చేసిన అభ్యర్థులను టాటా ఎలక్ట్రానిక్స్ హోసూరు, ఆల్‌స్టాం, శ్రీసిటీ నెల్లూరు, ఇన్ఫోసిస్, విప్రో బెంగళూరు వంటి పరిశ్రమలు రిక్రూట్ చేసుకుంటున్నాయి. అమ్మాయిలను సుదూరప్రాంతాలకు పంపించడం ఇష్టం లేని తల్లిదండ్రులు వారిని ఇంటికే పరిమితం చేస్తున్నారు. వీరు కష్టపడి చదివిన చదువు వృథా అవుతోంది. ఈ పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటు చేస్తే స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- ధర్మిరెడ్డి ప్రసాద్, ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్, అచ్యుతాపురం



రెపె ఛేజ్ హీట్స్‌లో ఎర్రాజీ జ్యోతి

- సెమీఫైనల్స్‌కు చేరే అవకాశం

- 7లో

ఐదేళ్లుగా అవే కష్టాలు

జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులానికి తీరని వసతి సమస్య

- ఐదేళ్లు స్థలం కేటాయింపులు, నిధుల మంజూరు తోనే కాలక్షేపం
- ఇంకా అద్దె భవనంలోనే గురుకులం
- ఇక్కట్లు పడుతున్న విద్యార్థినులు


చోడవరంలోని అద్దె భవనంలోని జ్యోతిబాపూలే బాలికల గురుకులం

చోడవరం, ఆగస్టు 7: పట్టణంలో ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల ఉన్నత పాఠశాలకు సొంత గూడు కలగా మిగిలింది. బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేసి ఐదేళ్లు కావస్తున్నా, ఇప్పటికీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ఏర్పాటుచేసిన ఈ గురుకులానికి ఐదేళ్లలో భూమి కేటాయింపు తప్పితే.. నిధులు మంజూరులో తీవ్రమైన జాప్యమైంది. దీంతో భవనాల నిర్మాణానికి మోక్షం లభించలేదు.


గురుకులం విద్యార్థినులు

చోడవరం నియోజకవర్గానికి మంజూరైన జ్యోతిబాపూలే స్కూల్‌ను 2019 సెప్టెంబరులో స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలోని అద్దె భవనంలో ఏర్పాటుచేశారు. ఈ గురుకులంలో ఐదు నుంచి పదో తరగతులు నిర్వహిస్తున్నారు. రెండు అంతస్థుల అద్దె భవనంలో నడుస్తున్న ఈ గురుకులంలో ఓ ఫ్లోర్‌లో విద్యార్థినులకు వంట గది, భోజనాల నిర్వహణ కొనసాగుతుండగా, రెండు మూడు ఫ్లోర్లలో విద్యార్థినుల తరగతి గదులు డార్మెటరీ ఉన్నాయి. విద్యార్థినులకు తగినంతగా వసతి లేకపోవడంతో వారు ఇరుకు గదుల్లోనే ఐదేళ్లుగా సర్దుకుపోతున్నారు.

జన్నవరంలో స్థలం కేటాయింపుతో సరి

జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులానికి మండలంలోని జన్నవరం పంచాయతీ పరిధిలో 10 ఎకరాల స్థలాన్ని అధికారులు కేటాయించారు. ఈ స్థలాన్ని బీసీ గురుకులం సొసైటీ పేరిట బదలాయించడంలో తీవ్ర జాప్యమైంది. స్థలం కేటాయించడంతో భవనాల నిర్మాణానికి రూ. 35 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థలం అప్పగింత పూర్తి కావడం, నిధులు కూడా మంజూరు కావడంతో ఇక భవనాల నిర్మాణం ప్రారంభం అవుతుందని అంతా భావించారు. గురుకులానికి మంజూరైన నిధుల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం జీవో జారీ చేసినా.. ఆర్థిక శాఖ నుంచి అనుమతి రాకపోవడంతో ... మిగతా 8వ పేజీలో

చేనేతకు మంచి రోజులు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

- 'పేట'లో జాతీయ చేనేత దినోత్సవం


మగ్గంపై నేస్తున్న జాంధానీ చీరను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

పాయకరావుపేట, ఆగస్టు 7 : చేనేత కార్మికుల కష్టాలు తీరి, వారికి మంచి రోజులు రానున్నాయని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని స్థానిక చేనేత సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమ స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు ఏడవ తేదీని జాతీయ చేనేత దినంగా ప్రకటించారన్నారు. మొదటి నుంచి చేనేతకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, అయితే గిట్టుబాటు ధర లేక చేనేత కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చేనేత కార్మికులు పడుతున్న కష్టాలు ఎలా అధిగమించాలన్న దానిపై ఉన్నతస్థాయిలో అధ్యయనం జరుగుతోందన్నారు. ముఖ్యంగా కొత్త డిజైన్లపై చేనేత కార్మికులకు అవగాహన, ఆధునిక పరికరాలు, మార్కెటింగ్ తదితర అంశాలు మెరుగుపర్చాల్సి ఉందన్నారు. గిట్టుబాటు ధర అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. స్థానిక చేనేత సొసైటీ మేనేజరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సొసైటీకి చెందిన షెడ్డు డీఆర్‌డీఏ ఆధీనంలో ఉందని, దీన్ని తిరిగి సొసైటీకి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ పలువురు సీనియర్ చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు చేనేత సొసైటీలో మగ్గాలపై ... మిగతా 8వ పేజీలో

ఎస్ఎంసీ ఎన్నికలకు బ్రేక్

ఉత్తర్వులు జారీ చేసిన ఎన్నికల కమిషన్

- పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల
- ఎమ్మెల్సీ కోడ్ నేపథ్యంలో ఎన్నికల కమిషన్‌ను సంప్రదించిన విద్యా శాఖ అధికారులు
- ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా వేయాలని ఆదేశం
- కోడ్ ముగిశాకే ఎన్నికలు నిర్వహణ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుని ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లాలో గురువారం జరగాల్సిన పాఠశాల యాజమాన్య కమిటీల (ఎస్ఎంసీ) ఎన్నికలు నిలిపి వేస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసి తల్లిదండ్రుల కమిటీల స్థానంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న పాఠశాల యాజమాన్య కమిటీల (ఎస్ఎంసీ) ఎన్నికలు ఈనెల 8న (గురువారం) జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో 1,424 పాఠశాలల్లో కొత్త కమిటీల ఎన్నికల కోసం జిల్లా విద్యాశాఖాధికారులు ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు సన్నద్ధమవుతున్నారు. ఇంతలో ఈనెల 30వ తేదీ వరకు స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారంటూ కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు డీఈఓ ఎంవీ లక్ష్మమ్మ ఎన్నికల నిర్వహణపై ఈసీకి లేఖ రాశారు. దీనికి స్పందించిన ఈసీ స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలు ఉన్నంత వరకు పాఠశాల యాజమాన్య కమిటీల నియామకాల ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా వేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ లక్ష్మమ్మ జిల్లాలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా పడినట్టు ఉత్తర్వులు జారీ చేశారు.

డీఈఓ వివరణ

జిల్లాలో గురువారం జరగాల్సిన పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు నిలుపుదల చేస్తున్నట్లు డీఈఓ ఎంవీ లక్ష్మమ్మ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో వున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశామన్నారు. తదుపరి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఎస్ఎంసీ ఎన్నికలు ఎప్పుడు అనేది నిర్ణయించి షెడ్యూల్ ప్రకటిస్తామని ఆమె తెలిపారు.

క్రైం... crime news

రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైలునుంచి జారిపడి మృతి చెందిన వ్యక్తి

ఎస్.రాయవరం, ఆగస్టు 7 : రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ బుధవారం తెలిపారు. నర్సీపట్నం రోడ్డు వైపు నుంచి తుని వైళుతున్న రైలులో ప్రయాణిస్తున్న సుమారు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్- గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో ప్రమాదవశాత్తు జారిపడడంతో దుర్మరణం చెందాడన్నారు. అతడి శరీర భాగాలు తెగిపడ్డాయన్నారు. అయితే మృతునికి సంబంధించి పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు. తెలుపురంగు మీద ఎరుపు రంగు సన్నటి నిలువు చారలు కలిగిన ఫుల్ చేతుల చొక్కా, కాఫీ రంగు లోవర్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో భద్రపర్చామని, ఇతని సంబంధీకులు ఉంటే వెంటనే సంప్రదించాలని ఆయన సూచించారు.

శారదానదిలో పడి తాపీమేస్త్రి మృతి

దేవరాపల్లి, ఆగస్టు 7: బహిర్భూమికి వెళ్లిన తాపీ మేస్త్రి ప్రమాదవశాత్తూ శారదా నదిలో జారిపడి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన తాపీమేస్త్రీ కొమ్మనాపల్లి అమ్మతల్లి (40) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ శారదా నదిలో పడిపోవడంతో ప్రాణాలు విడిచాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

కారు బోల్తా : నలుగురికి గాయాలు


హైవే పక్కన పొలాల్లో బోల్తా పడిన కారు

నక్కపల్లి, ఆగస్టు 7: మండలంలోని ఒడ్డిమెట్ట హైవే వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాలివి. నక్కపల్లి మండలం ముకుందరాజుపేట గ్రామానికి చెందిన మామిడి రాంబాబు, సత్యవతి దంపతులు తుని నుంచి బైక్‌పై వస్తుండగా, ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొని, హైవే పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకుపోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాంబాబు, అతని భార్యతో పాటు కారులో ఉన్న అచ్యుతాపురం మండలం గొర్లి ధర్మవరం గ్రామానికి మరో ఇద్దరు గాయాలకు గురయ్యారు. పోలీసులు వీరిని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 : ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై బుధవారం ఫిర్యాదు అందినట్టు పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మాడుగుల గ్రామానికి చెందిన విద్యార్థినిని ఆమె తండ్రి మూలపేటలో ఉన్న తన సోదరుడి ఇంటికి పంపించాడన్నారు. రెండు నెలలుగా ఇక్కడే ఉంటున్న సదరు విద్యార్థిని బుధవారం తెల్లవారుజాము ఐదు గంటల సమయంలో ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. దీంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 : పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్‌లో ఓ వ్యక్తి పది మద్యం సీసాలతో పట్టుబడినట్టు హెడ్ కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. సబ్బవరం గ్రామానికి చెందిన గనిరెడ్డి అప్పారావు అనకాపల్లిలోని మద్యం దుకాణాల్లో పది మద్యం సీసాలను బుధవారం కొనుగోలు చేసి సబ్బవరం వెళ్లేందుకు సుంకరమెట్ట జంక్షన్ వద్ద ఉన్నాడన్నారు. అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేయగా, అతని వద్ద మద్యం సీసాలు పట్టుబడడంతో స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ట్రెంచ్ తవ్వకంపై ఇరువాడ రైతులు ఆందోళన


నిరసన తెలియజేస్తున్న రైతులు

సబ్బవరం, ఆగస్టు 7 : పొలాలకు వెళ్లే మార్గంలో రెవెన్యూ అధికారులు ట్రెంచ్ తవ్వడం పట్ల ఇరువాడ రైతులు బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు తాతారావు, గురువులు, దళిత నేత పాల్తేటి పెంటారావు తదితరులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు సర్వే నెంబర్లు 103, 106లలో ఆక్రమణలు జరిగాయని చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు పొలాలకు వెళ్లే మార్గంలో ట్రెంచ్ తవ్వారని ఆరోపించారు. అయితే ట్రెంచ్ ప్రభుత్వ భూముల్లో కాకుండా జాతీయ రహదారికి అనుకొని ఉన్న జిరాయితీ సర్వే నెంబరు 108లో తవ్వడం తగదని వాపోయారు. ఈ కారణంగా పొలాల్లో దమ్ముల సమయంలో తామంతా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా వారు కోరారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే...

విశాఖపట్నం, ఆగస్టు 7: కేకే లైన్‌లో కిరండోల్ ప్రాంతంలో ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్నందున విశాఖ- కిరండోల్ మధ్య నడుస్తున్న పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యాలను దంతెవాడ వరకు కుదించినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండోల్ పాసింజర్ (08551) రైలు, విశాఖ- కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18514) రైళ్లు ఈనెల ఎనిమిది నుంచి 14వ తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్- విశాఖ పాసింజర్ (08552), కిరండోల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18513) రైళ్లు ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు దంతెవాడ నుంచి బయలుదేరి విశాఖకు నడుస్తాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

మళ్లింపు మార్గంలో సమతా ఎక్స్‌ప్రెస్

నాగపూర్ డివిజన్‌లో నిర్మాణ పనులు జరుగుతున్నందున విశాఖ, నిజాముద్దీన్ సమతా ఎక్స్‌ప్రెస్ రైళ్లు మళ్లింపు మార్గంలో నడుస్తాయని సీనియర్ డీసీఎం తెలిపారు. ఈ ఎక్స్‌ప్రెస్ (12807) ఈనెల ఎనిమిదిన వయా విజయవాడ, నాగపూర్ మీదుగా, తిరుగు ప్రయాణంలోని నిజాముద్దీన్-విశాఖ సమతా ఎక్స్‌ప్రెస్ (12808) ఈనెల 9న వయా నాగపూర్, విజయవాడ మీదుగా నడుస్తాయని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

శిథిలావస్థలో గవరపాలెం వెటర్నరీ డిస్పెన్సరీ భవనం

- జీటలు వారిన గోడలు
- పెచ్చులూడి పడుతున్న శ్లాబు
- భయం.. భయంగా.. సిబ్బంది విధులు
- పశువులను తెచ్చే రైతులకూ అసౌకర్యాలే


బీటలు వారి ఉన్న ఆసుపత్రి లోపలి భాగం గోడలు


శ్లాబ్ పెచ్చులూడి కిందపడిన దృశ్యం

కొత్తూరు, ఆగస్టు 7: అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం శివారున ఉన్న ప్రభుత్వ వెటర్నరీ డిస్పెన్సరీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో బితుకు బితుకుమంటూ సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, వివిధ పనులపై వచ్చే పాడి రైతులు అసౌకర్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఆసుపత్రి భవనాన్ని 1989లో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న దాడి వీరభద్రరావు ప్రారంభించారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో పాడికి అధిక శాతం రైతులు మక్కువ చూపేవారు. పాడి రైతులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా దీని నిర్మాణం చేట్టారు. ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో పశువులు, జంతువులను ఈ ఆసుపత్రికి తీసుకువచ్చి ఉచితంగా వైద్యం చేయించుకునేవారు. కాగా, కాలక్రమేణా ఈ భవనం గత ఐదేళ్ల నుంచి శిథిలావస్థకు చేరుకోవడంతో లోపల భాగంలో శ్లాబు పెచ్చులుడి పడుతున్నాయి. దీని వల్ల మందులు భద్రపరిచేందుకు కూడా వీలు లేకుండా పోయింది. అంతేకాకుండా సిబ్బంది కూడా పెచ్చులు ఊడి తమపై ఎక్కడ పడతాయోనని భయాందోళన చెందుతున్నారు.

ఇదిలావుంటే, ప్రతిరోజూ 30 పాడి పశువులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. అయితే పశువులకు వైద్యం అందించేందుకు సరైన షెడ్డు లేకపోవడంతో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు కూర్చునేందుకు కూడా వసతి సౌకర్యాలు లేదు. ఆరు పంచాయతీల పాడి పశువులకు ఈ ఆసుపత్రి నుంచే వైద్యం అందిస్తున్నారు. అనకాపల్లి మండలంలోని బవులవాడ, తుమ్మపాల, పిసినికాడ, సత్యనారాయణపురం, కొత్తూరు, గవరపాలెం అర్బన్ పంచాయతీల్లో పాడి పశువులకు ఉచితంగా సేవలు అందిస్తున్నారు. కాగా ఆసుపత్రిలో ఒక వైద్యుడు, ఒక ఆఫీసు సబ్ ఆర్డినేటర్ ఉన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఉన్నతాధికారులు ఇక్కడి సమస్యలపై తక్షణమే ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా పాడి రైతులు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న గవరపాలెం పశువైద్యశాల భవనం

ఉన్నతాధికారుల దృష్టికి భవనం దుస్థితి



ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. అంతేకాకుండా ఇక్కడ సమస్యలపై నివేదిక పంపించాం. రోజుకి సుమారు 35 వరకు పశువులను చూలు, సాధారణ తనిఖీలు, సాధారణ వ్యాధులపై చికిత్సకు తీసుకువస్తారు.

- డాక్టర్ అనిల్ కుమార్, పశువైద్యాధికారి

డిగ్రీ కళాశాలలో నాయకత్వ లక్షణాలపై ఆన్‌లైన్ సదస్సు

- విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా


సదస్సులో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు


ఆన్‌లైన్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్ కందా

ఎలమంచిలి, ఆగస్టు 7: పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'నాయకత్వం, నైతికతల మధ్య సమన్వయం' అంశంపై జాతీయ స్థాయి ఆన్‌లైన్ సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్త ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన నాయకత్వ లక్షణాలు, వాటి యొక్క విలువల గురించి తెలియజేశారు. వివిధ అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మోహన్‌కందా సమాధానాలు ఇచ్చారు. ఈ సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాల డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి రేఖా రామారావు, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు వి.చిట్టిబాబు, ఎం.కిశోర్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వలస కార్మికుల ప్రయాణం


ఆటో తొట్టిలో కూర్చొని విధులకు వెళ్తున్న వలస కార్మికులు (ఫైల్)

పరవాడ, ఆగస్టు 7 : మండల పరిధిలో గల ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ, స్థానిక ఇండస్ట్రియల్ పార్కులోని పరిశ్రమల్లో పనిచేస్తున్న వలస కార్మికులకు కనీస రవాణా సౌకర్యాలు కల్పించడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి పొట్టకూటి కోసం వచ్చిన వారి బతుకులకు గ్యారెంటీ లేకుండా పోతుంది. తొట్టి ఆటోల్లో, వ్యాన్లలో ప్రమాదకరంగా ప్రయాణించే పరిస్థితి ఎదురౌతోంది. సంబంధిత కాంట్రాక్టర్లు కార్మికులకు రవాణా సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చాలా మంది కార్మికులు తొట్టి ఆటోల్లో వేలాడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం ఫార్మాసిటీకి వెళ్లే రహదారితో పాటు ఎన్టీపీసీకి వెళ్లే రహదారిలో వలస కార్మికులు వాహనాల్లో వేలాడుతూ వెళ్తున్న దృశ్యాలను చూస్తున్నవారు ఎప్పుడు ఏం జరుగుతుందోనని హడలిపోతున్నారు. వలస కార్మికులకు రవాణా సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

- రేషన్ డిపోల ద్వారా సరుకుల నిర్ణయంపై డీలర్లు హర్షం


క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 : ఇక్కడి డీసీ ఎంఎస్ కార్యాలయం ఆవరణలో బుధవారం రేషన్ డీలర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. అమరావతిలో సోమవారం జరిగిన కలెక్టర్ల సమీక్షలో పౌర సరఫరాల విషయమై ఆలోచన చేసినప్పుడు ఎండీయూ వ్యవస్థ వల్ల అనేక రకమైన ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారని వారు గుర్తించారన్నారు. అందువల్ల ప్రజలకు రేషన్ సరుకులు రేషన్ డిపోల ద్వారానే పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టేందుకు ముందుకు వచ్చారని పేర్కొంటూ వారంతా హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు శేషు, పెంటకోట నాయుడు, ఈశ్వరరావు, రాజు, ఎర్రనాయుడు, రజని, సత్యవతి, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

రెపె ఛేజ్ హీట్స్‌లో ఎర్రాజీ జ్యోతి

- సెమీ ఫైనల్స్‌కు చేరే అవకాశం


పోటీలు పాల్గొన్న జ్యోతి యర్రాజీ (గ్రీన్ మార్క్ వద్ద)

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 7: పారిస్ విశ్వ క్రీడల మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రేస్‌లో విశాఖకు చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతికి మరో సువర్ణ అవకాశం లభించింది. బుధవారం జరిగిన 100 మీ. హర్డిల్స్ తొలి రౌండ్ హీట్స్-4 పాల్గొన్న జ్యోతి ఏడో స్థానంతో నిరాశపరిచింది. దీంతో సెమీ ఫైనల్స్‌కు నేరుగా అర్హత సాధించలేకపోయింది. అయితే గురువారం జరగనున్న రెపెచేజ్ హీట్-1లో పోటీపడే అవకాశం దక్కింది. (ఇంటర్నేషనల్ కెరీర్‌లో అత్యుత్తమ టైమింగ్ నెలకొల్పిన అథ్లెట్లకు సెమీస్‌కు చేరేందుకు టెక్నికల్ కమిటీ కల్పించే ఈ అవకాశాన్ని రెపె ఛేజ్ అంటారు). ఈ హీట్-1లో జ్యోతితో కలిపి ఎనిమిది మంది పోటీపడనున్నారు.

13.16 సెకన్లలో రేస్ పూర్తి

బుధవారం జరిగిన రౌండ్-1 హీట్-4 జమైకా, ఐర్లాండ్, స్విట్జర్లాండ్, రష్యా, ఫ్రాన్స్, హంగేరి, వెనుజులాకు చెందిన బలమైన ప్రత్యర్థులతో పోటీపడిన జ్యోతి ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఈ హీట్స్‌లో ఎనిమిది మంది పోటీపడగా జ్యోతి ఏడోస్థానంలో నిలిచింది. తొలిస్థానం సాధించిన డేనియల్ విలియమ్స్ (జమైకా) తన రేస్‌ను 12.59 సెకన్లలో పూర్తిచేయగా ఏడోస్థానంలో నిలిచిన ఎర్రాజీ జ్యోతి 13.16 సెకన్లలో పూర్తి చేసింది. ఒలింపిక్స్ ముందు చైనాలోని చెంగుడులో జరిగిన సీజన్ మీట్‌లో 12.78 సెకన్ల టైమింగ్‌తో అద్భుత ఫాంలో ఉన్న జ్యోతి ఒలింపిక్స్ హీట్స్‌లో 100మీ. హర్డిల్స్‌కు 13.16 సెకన్ల సమయం తీసుకుంది. కాగా గురువారం జరిగే రెపె ఛేజ్‌లో రాణించాలని క్రీడా ప్రతినిధులు ఆశిస్తున్నారు.

సీతాకోకచిలుక ప్రాజెక్టుతో గిరిజనులకు ఉపాధి

- పర్యాటకులకు మధురానుభూతిని కల్పిస్తాం..
- కాఫీహౌస్ పనులను పరిశీలించిన విశాఖ డీఎఫ్‌వో అనంతశంకర్


కాఫీహౌస్ పనులను పరిశీలించి సూచనలిస్తున్న డీఎఫ్‌వో అనంతశంకర్

అనంతగిరి, ఆగస్టు 7 : సీతాకోకచిలుక ప్రాజెక్టుతో గిరిజనులకు ఉపాధి కల్పిస్తామని విశాఖపట్నం డీఎఫ్‌వో అనంత్‌శంకర్ అన్నారు. బుధవారం మండలంలోని మర్రిగుడ సమీపంలోని చాపరాయి వద్ద సింహాద్రి ఎన్టీపీసీ సహకారంతో జరుగుతున్న సీతాకోక చిలుక ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 5.5 కోట్ల ప్రాజెక్టు పర్యాటకులకు మరపురాని అనుభూతి కలిగేలా ఉండబోతుందన్నారు. సోలార్ ఆర్వోప్లాంట్, కాఫీ హౌస్ ఎదురుగా ఉన్న ప్రదేశంలోని పర్యాటకులు సౌకర్యార్థం టెంట్స్ ఏర్పాటు చేయాలని, అలాగే పార్కింగ్ సదుపాయం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

అనంతరం మర్రిగుడ వీఎస్ఎస్ సభ్యులతో కొంతసేపు ముచ్చటించారు. అడవులను నాశనం చేయకుండా జీవవైవిధ్యాన్ని పరిరక్షిస్తూ.. గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని గిరిజన నిరుద్యోగుల అభివృద్ధికి, వన్యప్రాణులు సంరక్షణకు ఉపయోగించనున్నట్టు డీఎఫ్‌వో అనంత్‌శంకర్ తెలిపారు. ఆయన వెంట సబ్ డీఎఫ్‌వో ధర్మ రక్షిత్, రేంజర్ దుర్గాప్రసాద్, సెక్షన్ అధికారులు సీతారాం పాల్గొన్నారు.

పంద్రాగస్టు పరేడ్‌కు దివ్యనయన ఎంపిక


దివ్యనయన

దేవరాపల్లి, ఆగస్టు 7: విజయవాడలో ఈనెల 15న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవం పరేడ్‌కు దేవరాపల్లి మండలం చిననందిపల్లికి చెందిన సబ్బవరపు దివ్యనయన ఎంపికైంది. ఈ విషయాన్ని ఆమె తండ్రి రమణమూర్తి బుధవారం తెలిపారు. ప్రస్తుతం దివ్యనయన విశాఖలోని రఘు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. అదే కళాశాలలో ఎన్‌సీసీలో చేరింది. ఎన్‌సీసీలో ప్రతిభ కనబర్చడంతో ఈ అవకాశం దక్కిందని రమణమూర్తి చెప్పారు. అలాగే జనవరి 26న ఢిల్లీలో గణతంత్ర వేడుక పరేడ్‌లో సైతం పాల్గొనే అవకాశం దివ్యకు లభించినట్టు చెప్పారు. ఈ ప్రాంత అమ్మాయికి అవకాశం రావడం స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

9న నూకాంబిక ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 : ఉత్తరాంధ్రుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి బాలాలయంలో ఈ నెల తొమ్మిదో తేదీ శ్రావణమాసం మొదటి శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఉచితంగా నిర్వహించనున్నామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. వ్రతం చేయదలచిన భక్తులు ముందుగా పేర్లు కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే, ఈ నెల 11న సప్తమి స్వాతి నక్షత్రంతో కూడిన మొదటి ఆదివారం విశేషమైన రోజు కావడంతో బాలాలయంలో అమ్మవారికి నింబ పత్రములు (వేప ఆకులు)తో ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

దివ్యాంగ బాలల కోసం రూ.37.86 లక్షలు మంజూరు

- జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల

చోడవరం, ఆగస్టు 7: జిల్లాలో సమగ్ర శిక్షా భవిత కేంద్రాల్లో ఉన్న దివ్యాంగ బాలలకు రూ.37 లక్షల 86 వేల రూపాయలు ప్రోత్సాహకాలు మంజూరైనట్టు జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల తెలిపారు. బుధవారం ఆమె స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించి దివ్యాంగ బాలలతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 1485 మంది దివ్యాంగ బాలబాలికలకు రవాణా ఖర్చులు, గృహ అలవెన్సు, బాలికల స్టైపెండ్‌ల కింద నిధులు మంజూరయ్యాయని, వీటిని వారి ఖాతాలతో జమ చేశామన్నారు. దివ్యాంగ బాలలకు భవిత కేంద్రాల ద్వారా సాయం అందుతుందన్నారు. ఈ సందర్భంగా బాలలకు ఇచ్చిన ట్యాబ్‌ల పనితీరును ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమేష్, ఫిజియోథెరపిస్టు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

- ఆర్టీసీ బస్టాండ్‌లో నార్కోటిక్ డాగ్ తనిఖీలు
- పెదబొడ్డేపల్లి, బలిఘట్టంలో వాహన సోదాలు


ఆర్టీసీ బస్టాండ్‌లో బ్యాగులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సుధాకరరావు

నర్సీపట్నం, ఆగస్టు 7: గంజాయి అక్రమ రవాణా కట్టడిలో భాగంగా పట్టణ పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. బుధవారం మాదకద్రవ్యాలను పసిగట్టే పోలీసు శునకంతో ఎస్సై సుధాకరరావు ఆర్టీసీ బస్టాండ్‌లోని ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేశారు. బలిఘట్టం, పెదబొడ్డేపల్లి శివారులో బైక్‌లు, కార్లు తనిఖీ చేశారు. ఏజెన్సీ నుంచి విశాఖపట్నం, తుని వైపు వెళ్లే అన్ని వాహనాలలో క్షుణ్ణంగా సోదాలు చేశారు. మాదక ద్రవ్యాల బారిన పడకుండా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు పటిష్ఠ ఏర్పాట్లు

- రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్


మాట్లాడుతున్న జేసీ అశోక్‌కుమార్

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల కోటాలో ఈ నెల 30వ తేదీన జరుగనున్న ఎమ్మెల్సీ ఉపఎన్నిక నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని శాంతి భద్రతల సమస్యలు ఏర్పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా ఏఆర్‌ఓలు, పోలీసు అధికా రులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితాల రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు పై సూచనలు ఇచ్చారు. సాంకేతికపరమైన విషయాలలో ఆచితూచి వ్యవహరిం చాలన్నారు. సమావేశంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఏఆర్వోలు కె.మోహన్‌కుమార్, వై.శ్రీనివాసరావు, కె.పద్మావతి పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో సోప్ యూనిట్

- జీసీసీ ఎండీ కల్పనాకుమారి ఆదేశం


సబ్బులను పరిశీలిస్తున్న ఎండీ కల్పనాకుమారి

అరకులోయ, ఆగస్టు 7 : మూడేళ్లుగా మూతబడిన అరకు సోప్ యూనిట్‌ను వారం రోజుల్లో తెరవాలని జీసీసీ ఎండీ కల్పనాకుమారి ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి అరకులోయకు విచ్చేసిన ఆమె, ముందుగా హట్టగుడలోని నాంధి సంస్థకు చెందిన కాఫీ పల్పింగ్ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం సోప్ యూనిట్‌క విచ్చేశారు. శిక్షణ పొందిన సిబ్బందిని ఉంచి యూడా యూనిట్‌ను నిర్వహించకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరును మార్చుకోవాలని, సంస్థ ఉన్నతికి అందరూ అంకితభావంతో పని చేయాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. వారం రోజుల్లో సోప్ యూనిట్ తెరవకపోతే ఇంటికి పంపేస్తానని యూనిట్ ఇన్‌చార్జిని హెచ్చరించారు. కార్మికులతో మాట్లాడుతూ జీతాలు వస్తున్నాయా? లేదా? అని ఆరా తీశారు. సోప్ యూనిట్‌ను తెరచిన వెంటనే కార్మికులంతా చక్కగా పని చేయాలన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్, జీసీసీ జీఎం (మార్కెటింగ్) శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారి ఉమాదేవి, పాడేరు డీఎం సింహాచలం, పాడేరు, అరకులోయ బ్రాంచి మేనేజర్లు బుక్కా వెంకటేష్, శ్రీనివాసరావు, సోప్ యూనిట్ మేనేజర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీ విజయమే లక్ష్యంగా పనిచేద్దాం

» ప్రలోభాలకు తలొగ్గొద్దు : ఎమ్మెల్సీ ఉప ఎన్నికల వైసీపీ అభ్యర్థి బొత్స



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 : ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో వైసీపీ విజయమే లక్ష్యంగా అంతా పనిచేద్దామని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని రింగురోడ్డులో గల వైసీపీ కార్యాలయంలో అనకాపల్లి నియోజకవర్గ ఎంపీటీసీ, జడ్పీటీసీ, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీకి సంఖ్యా బలం అధికంగా ఉన్నప్పటికీ కూటమి పోటీలోకి దిగుతుందన్నారు. కూటమి నాయకులు పెట్టే ప్రలోభాలకు ఎవరూ లొంగొద్దన్నారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పార్టీ ప్రకటించిన అభ్యర్థి విజయం సాధించేలా అందరం కృషి చేద్దామన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, నాయకులు దిలీప్‌కుమార్, బుల్లిబాబు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

'నిర్వాసితులకు న్యాయం చేశాకే కారిడార్ పనులు'



నిర్వాసితుల సమస్యలను వివరిస్తున్న రైతు సంఘం ప్రతినిధి అప్పలరాజు

నక్కపల్లి, ఆగస్టు 7 : విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలో భూములిచ్చిన రైతులతో పాటు, కల్లుగీత కార్మికులు, దళితులు, మత్స్యకారులు, భూములులేని పేదలకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం చందనాడ గ్రామంలో నిర్వాసిత రైతులతో కలిసి స్థానిక విలేకర్లతో మాట్లాడారు. చందనాడలో దళితుల గుల్లబట్టీలు, డి.పట్టా, సాగు భూములకు, మత్స్యకారుల సొసైటీ భూములకు, డీఎల్‌పురంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు నష్టపరిహారం ఇచ్చిన తరువాతే కారిడార్ ప్రాంతంలో పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో చందనాడ సర్పంచ్ తళ్లా రోహిణి భార్గవ్, రైతులు గోవింద్, సువర్ణరాజు, వై.మన్నియ్య, వై.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

» 'పేట' పీహెచ్‌సీ సిబ్బందికి కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం » సీజనల్ వ్యాధులపై అప్రమత్తం కావాలని సూచన

పాయకరావుపేట, ఆగస్టు 7 : ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలను పరిశీలించిన ఆమె చికిత్స పొందుతున్న ఇన్ పేషెంట్లను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రితో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో రోగాలు ప్రబలితే వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఎంపీడీవో కె.స్వప్న, ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, వైద్యాధికారి డాక్టర్ సుభాష్ ఎంపీఈవో రమణ పాల్గొన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఇళ్ల వద్ద నీటి నిల్వలు ఉంటే వ్యాధుల ముప్పు

» మలేరియా విభాగం జిల్లా ఇన్‌చార్జి అధికారి పీజేఎంఆర్‌పీ నాయుడు

ఎస్.రాయవరం, ఆగస్టు 7 : ప్రజలంతా తమ ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా విభాగం జిల్లా ఇన్‌చార్జి అధికారి పీజేఎంఆర్‌పీ నాయుడు సూచించారు. మండలంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధి ఉప్పరాపల్లి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. పలు ఇళ్ల వద్ద పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు నీటిని భద్రపర్చుకునే వాటిపై మూతలు ఉండేలా చూసుకోవాలన్నారు. అలా చేయడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా తదితర వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి టి.నాగేశ్వరరావు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లీనిక్ క్లస్టర్ పర్యవేక్షకుడు డాక్టర్ పి.ఎస్.వి.ఎస్.ప్రసాద్, కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ కె.శ్రావణి, హెల్త్ సెక్రటరీ జి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉప్పరాపల్లిలో నీటిని పరిశీలిస్తున్న పీజేఎంఆర్‌పీ నాయుడు

టీడీపీలో చేరిన 80వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి

» భాస్కరరావుకు కండువా కప్పి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 : ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక త్వరలో జరగనున్న తరుణంలో వైసీపీకి షాక్ తగిలింది. అనకాపల్లికి చెందిన జీవీఎంసీ 80వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో విశాఖలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. భాస్కరరావుకు ఆయన కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ నాయకులు పీలా శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



భాస్కరరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పల్లా శ్రీనివాసరావు

అన్నింటా పునరావాస కాలనీ అభివృద్ధి

» ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



పునరావాస కాలనీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, ఆగస్టు 7 : సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం పంచాయతీ)ని అన్ని అన్నింటా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. కాలనీలో బుధవారం ఆయన పర్యటించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్వాసిత కాలనీలో కనీస మౌళిక వసతులు కల్పించలేదన్నారు. దీంతో అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. తాగునీరు, ఛిన్నాభిన్నమైన డ్రైనేజీ వ్యవస్థ, అధ్వాన రోడ్లు తదితరాలతో పాటు లోఓల్టేజీ సమస్య ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ వచ్చారు. అనంతరం కాలనీకి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి, ఎక్కడెక్కడ ఏఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రాజాన రమేష్‌కుమార్, భైలపూడి శ్రీరామదాసు, రాజాన విజయ్, తుమ్మల రాజు, నీరుకొండ బాబూరావు, లాలం రాజు, తుమ్మల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయంలో శ్రావణ పూజలు

సబ్బవరం, ఆగస్టు 8 : మండల కేంద్రం సబ్బవరంలోని దుర్గమాంబ ఆలయంలో శ్రావణ మాసం పూజలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. తొమ్మిదో తేదీ మొదటి శుక్రవారం అమ్మవారికి గాజులతో అలంకరణ ఉంటుందన్నారు. 16వ తేదీ రెండో శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు, వరలక్ష్మీదేవి వ్రతం, 19న జంధ్యాల పౌర్ణమి పూజలు, 23న అమ్మవారి సారె ఊరేగింపు, 30న పంచామృతాభిషేకాలు జరుపుతామన్నారు. అలాగే, ప్రతి శుక్రవారం సాయంత్రం ఆరు గంటల నుంచి కుంకుమార్చనలు నిర్వహిస్తామని పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు



ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న పరవాడ సీఐ

పరవాడ, ఆగస్టు 7 : పాఠశాలలకు వచ్చి వెళ్లే సమయాల్లో విద్యార్థినీ విద్యార్థులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పరవాడ సీఐ బాల సూర్యారావు సూచించారు. స్థానిక బంగ్లా జంక్షన్‌లో బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రహదారి దాటేటప్పుడు వాహనాల రాకపోకలను గమనించాలన్నారు. బస్టాప్‌లలో ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలని సూచించారు. ట్రాఫిక్‌కు సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'వుడ్ క్లస్టర్ ఏర్పాటు ప్రకటన గొప్పది'

కొత్తూరు, ఆగస్టు 7 : వుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసి కార్పెంటర్లకు మేలు చేస్తానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ప్రకటించడం పట్ల బీజేపీ ఆర్టిజన్ సెల్ స్టేట్ కన్వీనర్ బంగారు బాబు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ ప్రభుత్వం వచ్చినా చేతి వృత్తిదారులను పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఎంపీ సీఎం రమేష్ కార్పెంటర్లకు అనకాపల్లిలో వుడ్ క్లసర్ ఏర్పాటు చేస్తానని చెప్పడం గొప్పవిషయంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ పవన్, కో-కన్వీనర్లు బాబ్జీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత సూర్యనారాయణకు నివాళి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 : విశాఖ ఉమ్మడి జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్యనారాయణ పదో వర్ధంతిని సోమవారం ఇక్కడ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతర ప్రజా సమస్యలపై ఆయన పోరాట పటిమను వివరించారు. జిల్లా కార్యవర్గసభ్యులు ఆర్.శంకరరావు, శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాజాన దొరబాబు, వైఎస్ భద్రం, కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చెర్లోపలి ఆయకట్టు రైతులను ఆదుకోవాలి

తుమ్మపాల, ఆగస్టు 7 : శారదానది నుంచి ప్రవహించే చెర్లోపలి ఆయకట్టుపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులను ఆదుకోవాలని సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎస్ భద్రం కోరారు. ఆ పార్టీ నాయకులతో కలిసి బుధవారం చెర్లోపలి గ్రోయిన్, పంట కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెర్లోపలి గ్రోయిన్‌పై ఉన్న ఆనకట్ట మరమ్మతులకు గురై పూర్తిస్థాయిలో రైతులకు నీరు అందడం లేదన్నారు. దీంతో వందలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టి నీరందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొలమరశెట్టి రమణబాబు, మాదేటి సూర్యప్రకాశరావు, కొణతాల మాణిక్యాలరావు, బుద్ద శివాజీ, కొణతాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట సమస్యలపై ఆర్డీవోకు వినతి

రాంబిల్లి, ఆగస్టు 7 : కొత్తపేటలో పైడమ్మ గుడిని ఆనుకున్న ఉన్న చెరువును గ్రామానికి కేటాయించాలని సర్పంచ్ వానపల్లి వెంకట అరుణలత కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవో చిన్నికృష్ణను కలిసిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను వివరించారు. వానపల్లి జగన్నథరావు, పి.బాబూరావు, పైడిరెడ్డి, పైడిరాజు, మాడెం వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం



అనకాపల్లిలో చేనేత వస్త్రాలు పంపిణీ చేస్తున్న నేతలు



కోటవురట్లలో చేనేత కార్మికునికి సన్మానం

కొత్తూరు, ఆగస్టు 7 : జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం అనకాపల్లి బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు చేనేత వస్త్రాలను పంపిణీ చేశారు. చేనేత కార్మికులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఈ వారం రోజులూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి, ఆపన్నులకు పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

అస్క్ పాలిటెక్నిక్ కళాశాలలో...

కొత్తూరు అస్క్ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ కొణతాల లక్ష్మీనారాయణ హాజరై చేనేత ఉత్పత్తుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం చేనేత వస్త్రాలు, వాటి చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

పాయకరావుపేట : జాతీయ చేనేత దినోత్సవాన్ని పాయకరావుపేటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత సహకార సొసైటీ ఆవరణలో సమావేశం నిర్వహించిన అనంతరం అధిక సంఖ్యలో చేనేత కార్మికులు పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ ఆర్‌వీ మురళీకృష్ణ, ఏఓ ఎస్.రమణమ్మ, చేనేత సొసైటీ మేనేజర్ గోరు నాగేశ్వరరావుతో పాటు వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, దాసరి శ్రీనివాస్, చేనేత కార్మికులు కర్ర శ్రీను, బళ్ల దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : సాంప్రదాయ బద్ధంగా అంతా పట్టు, ఖాదీ, చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం జీహెచ్ఎస్ లక్ష్మి సూచించారు. బుధవారం కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్ ఆవరణంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టు, ఖాదీ వస్త్రాల తయారీ వాడకం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం సీనియర్ చేనేత కార్మికుడు రాపర్తి అప్పారావును సత్కరించారు. ఇన్‌చార్జి హెచ్ఎం నారాయణరెడ్డి, ప్రసాద్, భాను, ప్రమీళ, కృష్ణ, శ్రీనివాస్ చంద్రశేఖర్, కళ్యాణ్, రత్నం తదితరులుపాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



కశింకోటలో ప్లకార్డులతో ఎంపీడీవో తదితరులు

కశింకోట, ఆగస్టు 7 : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని, దీనిపై అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో కె.శేషుబాబు అన్నారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి తల్లిపాల వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు పట్టడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పద్మావతి, ఏసీడీపీవో శశికళ, డాక్టర్ యశోధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరు : సంపతిపురం, చిన సంపతిపురం, టి.వెంకుపాలెం, వేట జంగాలపాలెంలలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీ పీవో శశికళ, సూపర్‌వైజర్ కృష్ణవేణి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తుమ్మపాలలో తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ అధికారులు ప్రభావతి, శశికళ, తుమ్మపాల పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండలంలోని యండపల్లి, కె.వెంకటాపురం, కోటవురట్లలలో తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి తల్లిపాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాయకరావుపేట : తల్లిపాల వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా స్త్రీశక్తి భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌజన్య మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్యతో పాటు మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తుమ్మపాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

'వరిలో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు'

రాంబిల్లి, ఆగస్టు 7 : వరి సాగులో యాజమాన్య పద్ధతుల ద్వారా మేలైన దిగుబడులను సాధించుకోవచ్చునని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి పి.విజేత అన్నారు. మండలంలోని కుమ్మరాపల్లిలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవన ఎరువులు, పచ్చిరొట్ట నిచ్చే జీలుగ, జనుము వంటి వాటిని భూమిలో కలియదున్నడం ద్వారా భూమి సారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సి.సుమంత, సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడ : వరి పొలాల గట్లపై ఎర మొక్కలను నాటుకోవాలని ఏవో సీహెచ్.చంద్రావతి సూచించారు. రావాడలో బుధవారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పొలం గట్ల పై ఎర మొక్కలుగా బంతి, జనుము, కంది, పొద్దుతిరుగుడు లాంటి పసుపురంగు పువ్వులు పూసే మొక్కలను నాటడం ద్వారా వరి పొలంలో పురుగుల ఉధృతి తగ్గించవచ్చన్నారు. ఎర మొక్కలను పురుగులు ఆకర్షించి ప్రధాన పంట వరిని కాపాడుకోవడంలో ఉపయోగపడతాయన్నారు. సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, రాంకీ ఫౌండేషన్ మేనేజర్ శ్రీకాంత్, శ్రీనివాస్, వ్యవసాయ సహాయకులు గౌతమి, రాజేశ్వరి పాల్గొన్నారు.



కుమ్మరాపల్లిలో యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి

కశింకోట : వెదురుపర్తిలో పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వరి ఆకుమడుల యాజమాన్యం, వరి ఆకు చివర్లు తుంచడం తదితరాల వల్ల ఉపయోగాలను ఏవో స్వప్న రైతులకు వివరించారు. వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలోని పెట్టుగోళ్లపల్లిలో ఏవో సౌజన్య బుధవారం రైతు నేస్తం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సీఈవో గింజల అప్పారావుతో కలిసి పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాణ్యమైన పంటలను తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంపై రైతులకు వివరించారు. రైతు సేవా కేంద్రం, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీలో వైసీపీకి భారీ షాక్

... 5వ పేజీ తరువాయి

ప్రారంభమైన తర్వాత వైసీపీ కార్పొరేటర్లు ముందుగా జీవీఎంసీలోని పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. తర్వాత వైసీపీ క్యాంప్‌నకు గైర్హాజరైన నలుగురు కార్పొరేటర్లు కూటమి కార్పొరేటర్లతో కలిసి బస్సులో జీవీఎంసీకి చేరడంతో వైసీపీనేతలు అవాక్కయ్యారు.

అంచనాకు మంచి ఓట్లు

మధ్యాహ్నం రెండు గంటలకు పోలింగ్ ముగియడంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. అయితే అంచనాకు మించి కూటమి అభ్యర్థులకు ఓట్లు రావడంతో కూటమినేతలతోపాటు వైసీపీనేతలను సైతం ఆశ్చర్యపోయారు. కూటమికి 54 మంది కార్పొరేటర్లు బలం ఉంటే వారిలో ఒకరికి 66 ఓట్లు, ఇద్దరికి 65 ఓట్లు, మరో ఇద్దరికి 64 ఓట్లు, ఇంకో ఇద్దరికి 60 చొప్పున ఓట్లు రావడం విశేషం. మరోవైపు వైసీపీకి 43 మంది కార్పొరేటర్ల బలం ఉన్నప్పటికీ ఆపార్టీ నుంచి పోటీచేసిన అభ్యర్థుల్లో బిపిన్‌జైన్‌కు 21, కరజాడ వెంకట నాగశశికళకు 25, పల్లా అప్పలకొండకు 32, ముర్రువాణికి 36, తోట పద్మావతికి 36, మహ్మద్ ఇమ్రాన్‌కు 36 ఓట్లు వచ్చాయి. ఆపార్టీ నుంచి పోటీచేసిన సాడి పద్మారెడ్డికి మాత్రమే గరిష్ఠంగా 42 ఓట్లు పడ్డాయి. దీనినిబట్టి వైసీపీ కార్పొరేటర్లు కూటమి అభ్యర్థులకు ఓటేసినట్టు తేటతెల్లమైంది.

వైసీపీ నేతల ఆందోళన

కూటమి అభ్యర్థులకు పోలైన ఓట్లలో 14 బ్యాలెట్ పేపర్లపై పెన్ను, పెన్సిళ్లతో ప్రత్యేకంగా కోడ్ వేసి ఉన్నాయంటూ వైసీపీ నేతలు అభ్యంతరం వ్యక్తంచేశారు. బ్యాలెట్‌పత్రాలపై పెన్ను, పెన్సిళ్లతో ఎలాంటి గీతలు ఉండకూడదని, ఒకవేళ అలా ఉంటే వాటిని చెల్లని ఓట్లుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనికి అధికారులు ససేమిరా అనడంతో ఓట్ల లెక్కింపు కేంద్రం బయట ఆందోళనకు దిగారు. అప్పటికే జీవీ ఎంసీ కార్యాలయం ఆవరణలో ఉన్న డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, మొల్లి అప్పారావు, పల్లా దుర్గారావు అధికారులు నిబంధనలను పక్కనపెట్టి అధికారపార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. వారంతా కమిషనర్ పోర్టికో వద్ద బైఠాయించి పోలీసులకు, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన విరమింపజేసేందుకు యత్నించినా, తమకు కమిషనర్ వివరణ ఇవ్వాలని పట్టుబట్టడంతో ఏసీపీ సీహెచ్ వివేకానంద కమిషనర్ సంపత్‌కుమార్ వద్దకు వారిని తీసుకెళ్లారు. నిబంధనల్లో ఎక్కడా పెన్ను, పెన్సిల్, రహస్యకోడ్ ప్రస్తావనగానీ లేనందున, వాటిని చెల్లనిఓట్లుగా ప్రకటించడం సాధ్యం కాదని ఆయన వివరించారు. అయినా సంతృప్తి చెందక ఆందోళన కొనసాగించడంతో పోలీసులు వారిని బలవంతంగా బయటకు తరలించారు.

చేనేతకు మంచి రోజులు

... 5వ పేజీ తరువాయి

జాంధానీ వస్త్రాల తయారీని జిల్లా కలెక్టర్ పరిశీలించి, కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ ఆర్‌వీ.మురళీకృష్ణ, ఏఓ ఎస్.రమణమ్మ, ఎంపీడీఓ కె.స్వప్న, ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, దాసరి శ్రీనివాస్, దొంగబాబు, అధిక సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.



చేనేత కార్మికుడ్ని సత్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఐదేళ్లుగా అవే కష్టాలు

... 5వ పేజీ తరువాయి

అధికారులు టెండర్ల ప్రక్రియ నిర్వహించలేదు. ఎన్నికల సమయంలో మరోసారి నిధులు మంజూరైనట్టు అధికార పార్టీ నేతలు హడావిడి చేసినప్పటికీ అది కూడా కాగితాలకే పరిమితం కావడంతో ఇప్పటికీ జ్యోతిబాపూలే గురుకులం నిర్మాణ పనులు కార్యరూపం దాల్చలేదు. ఏడాదికి ఈ భవనానికి అద్దె రూపంలో రూ.7లక్షల చొప్పున ఖర్చవుతున్నది. చాలీచాలని అద్దెభవనంలో విద్యార్థినులకు ఇక్కట్లు ఎప్పటికీ తీరుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈసారైనా గురుకులానికి సొంత భవనం సమకూరుతుందనే ఆశ విద్యార్థినులు, ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతోంది.

అసంపూర్తిగా పాఠశాల భవనం

- పొంగలిపాక ప్రైమరీ స్కూలుకు భవనాల సమస్య
- అర్థాంతరంగా ఆగిన భవన నిర్మాణాలు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారే లేరు



అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవనాలు

మాడుగుల రూరల్, ఆగస్టు 7 : మండలంలోని పొంగలిపాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో ఎస్ఎస్ఏ నిధులతో భవన నిర్మాణ పనులు చేపట్టిరెండంతస్థుల భవనం నిర్మించారు. గది, వరండా కలిగిన ఈ భవనానికి రెండో అంతస్థుపై శ్లాబ్ వేయకుండా వదిలేశారు. బిల్లుల పెండింగ్, నిధులు కొరత కారణంగా ఈ భవనం నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు చెబుతున్నారు. దీంతో వర్షాలకు భవనం పాడవడంతో పాటు వర్షం నీరు నిలిచిపోయి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. నాడు-నేడులో కూడా ఈ పాఠశాలకు ప్రాధాన్యం ఇవ్వలేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో ఈ పాఠశాల అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నాయని దేముడమ్మ, ఎంపీటీసీ షైచర్ల సన్యాసిరావు, స్థానిక నాయకులు ఉండూరు దేముడు, నాయని సత్యనారాయణ, పాఠశాల కమిటీ ఛైర్‌పర్సన్ అశ్విని తదితరులు కోరుతున్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న మిషన్ కేంద్ర బృందం సభ్యులు

చీడికాడ, ఆగస్టు 7 : మండలంలోని వింటిపాలెం, తంగుడుబిల్లి, బి.సింగవరం గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులను ఇంటింటికీ వెళ్లి కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. బుధవారం ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ పుల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, సిబ్బంది ఆయా గ్రామాల్లో కొళాయి ద్వారా సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి మిషన్ పనితీరు గురించి ఆరా తీశారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలో జల్‌జీవన్ మిషన్ ద్వారా అమలవుతున్న మంచినీటి వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళలతో మాట్లాడారు. ప్రస్తుతం పనులు బాగానే జరుగుతున్నాయని గ్రామస్థులు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, సిబ్బంది రెడ్డి నారాయణరావు, డోకల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం



సంప్రదాయ వస్త్రధారణలో టీచర్లు, విద్యార్థులు

మాకవరపాలెం, ఆగస్టు 7 : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము మాట్లాడుతూ మన దేశంలో స్వదేశీ ఉద్యమాన్ని 1905, ఆగస్టు 7న ప్రారంభించారన్నారు.స్వదేశీ పరిశ్రమలు, చేనేత కార్మికులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏటా ఇదే తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు చేనేత దుస్తులు ధరించి పాఠశాలకు హాజరయ్యారు. చేనేత ప్రాధాన్యంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి : డైట్ లెక్చరర్ మహాలక్ష్మి



విద్యార్థులతో మాట్లాడుతున్న మహాలక్ష్మి

కె.కోటపాడు, ఆగస్టు 7 : చదువులో వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాన్ని ప్రతి ఉపాధ్యాయుడు పరిశీలించి ప్రత్యేక శ్రద్ధ చూపించాలని భీమిలి డైట్ లెక్చరర్ ఎం.మహాలక్ష్మి అన్నారు. బుధవారం ఏ.కోడూరు జడ్పీ హైస్కూల్, కె.సంతపాలెం ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సకాలంలో పాఠ్యాంశ బోధన జరుగుతుందా? లేదా? అనే విషయాన్ని పరిశీలించారు. విద్యార్థులను పాఠ్యాంశాల్లోని పలు ప్రశ్నలను అడిగారు. విద్యార్థుల నోట్ బుక్కు కరెక్షన్ వర్క్, ట్యాబ్‌ల వినియోగం పరిశీలించారు. రక్తహీనత గల విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యాంశంలో వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని వారి స్థాయిని పెంచడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 డీవీడీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కె.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల వర్షం



నర్సీపట్నంలో పడుతున్న వర్షం

నర్సీపట్నం, ఆగస్టు 7 : నర్సీపట్నంలో మోస్తారు వర్షం కురిసింది. బుధవారం ఉదయం 11 గంటల నుంచి గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ తడిసి ముద్దయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. బ్యాంకు కాలనీ, ప్రశాంతి నగర్, వెంకునాయుడుపేట స్కూల్ రోడ్డు, శివపురం, కొత్తవీధి శివారు ప్రాంతాలలో ఖాళీ స్థలాలో వర్షం వలన రోడ్లు చిత్తడి చిత్తడిగా మారి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్ నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో బుధవారం మోస్తరు వర్షం పడింది. ఈ ఏడాది కురిసిన వర్షాలకు ఖరీఫ్ వరి సాగుకు ఇబ్బందులుఉండవని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.కాగా, వర్షం కారణంగా వీధుల్లో రోడ్లు బురదమయంగా మారాయి.



వర్షంతో చిత్తడిగా కృష్ణాదేవిపేట రోడ్లు

తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్, సీడీపీవో మంగతాయారు
- ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



కె.కోటపాడులో భారీ అవగాహన ర్యాలీ



గొలుగొండ : చీడిగుమ్మల అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు సన్మానం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కె.కోటపాడు, ఆగస్టు 7 : తల్లి బిడ్డకు రోగ నిరోధక శక్తి, సంపూర్ణ ఆరోగ్యం, పౌష్టికాహారంతోనే సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీవో మంగతాయారు అన్నారు. తల్లిపాల వారోత్సవాలు ముగింపు సభను బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని చెప్పారు. అనంతరం కె.కోటపాడులోని మూడురోడ్ల జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించారు. తర్వాత ఆమె స్థానిక 50 పడకల ఆస్పత్రిని సందర్శించి ఇద్దరు బాలింతలకు డ్రెస్సు, బేబి కిట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎల్‌బీ సుశీల, ఎం.రాములమ్మ, ఎన్.కల్యాణి, జి.ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



రోలుగుంటలో అవగాహన ర్యాలీ..

గొలుగొండ : తల్లిపాలతోనే పుట్టిన బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని డాక్టర్ ధనుంజయ్ అన్నారు. మండలంలోని చీడిగుమ్మల, పుత్తడిగైరంపేట గ్రామాల్లో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చీడిగుమ్మల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి శ్రీగౌరి, సూపర్‌వైజర్లు సత్యవతి, అంగన్‌వాడీ సిబ్బంది, కిరణ్ పాల్గొన్నారు.

రోలుగుంట : తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ బుధవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలలోనే పోషకాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ధనలక్ష్మి, కొవ్వూరు మహిళా పోలీసు గొర్లివరలక్ష్మి, రోలుగుంట, బుచ్చెంపేట సెక్టార్ల సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరికీ పింఛన్లు'

మాడుగుల, ఆగస్టు 7 : అర్హులైన ప్రతీ ఒక్కరూ పింఛను పొందేవిధంగా దరఖాస్తు చేసుకోవాలని స్థానిక న్యాయవాది శ్రీనాథ ప్రసాదరావు పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక పాలకేంద్రం వద్ద పెన్షన్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ నేటికీ చాలా మంది అర్హులకు అందడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ పెన్షన్ తీసుకునేలా అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే దివ్యాంగులు సదరం ధ్రువపత్రాలు పొందేలా సచివాలయాల్లో ముందు స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

ఐదేళ్లుగా అవే కష్టాలు

... 5వ పేజీ తరువాయి

అధికారులు టెండర్ల ప్రక్రియ నిర్వహించలేదు. ఎన్నికల సమయంలో మరోసారి నిధులు మంజూరైనట్టు అధికార పార్టీ నేతలు హడావిడి చేసినప్పటికీ అది కూడా కాగితాలకే పరిమితం కావడంతో ఇప్పటికీ జ్యోతిబాపూలే గురుకులం నిర్మాణ పనులు కార్యరూపం దాల్చలేదు. ఏడాదికి ఈ భవనానికి అద్దె రూపంలో రూ.7లక్షల చొప్పున ఖర్చవుతున్నది. చాలీచాలని అద్దె భవనంలో విద్యార్థినులకు ఇక్కట్లు ఎప్పటికీ తీరుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈసారైనా గురుకులానికి సొంత భవనం సమకూరుతుందనే ఆశ విద్యార్థినులు, ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతోంది.

చేనేతకు మంచి రోజులు

... 5వ పేజీ తరువాయి



సీనియర్ చేనేత కార్మికుడిని సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

జాంధానీ వస్త్రాల తయారీని జిల్లా కలెక్టర్ పరిశీలించి, కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ ఆర్‌వీ.మురళీకృష్ణ, ఏఓ ఎస్.రమణమ్మ, ఎంపీడీఓ కె.స్వప్న, ఈఓపీఆర్డీ సీహెచ్. చంద్రశేఖర్, వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, దాసరి శ్రీనివాస్, దొంగబాబు, అధిక సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో వైసీపీకి భారీ షాక్

... 5వ పేజీ తరువాయి

ప్రారంభమైన తర్వాత వైసీపీ కార్పొరేటర్లు ముందుగా జీవీఎంసీలోని పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. తర్వాత వైసీపీ క్యాంప్‌నకు గైర్హాజరైన నలుగురు కార్పొరేటర్లు కూటమి కార్పొరేటర్లతో కలిసి బస్సులో జీవీఎంసీకి చేరుకోవడంతో వైసీపీ నేతలు అవాక్కయ్యారు.

అంచనాకు మించి ఓట్లు

మధ్యాహ్నం రెండు గంటలకు పోలింగ్ ముగియడంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. అయితే అంచనాకు మించి కూటమి అభ్యర్థులకు ఓట్లు రావడంతో కూటమినేతలతోపాటు వైసీపీనేతలను సైతం ఆశ్చర్యపోయారు. కూటమికి 54 మంది కార్పొరేటర్లు బలం ఉంటే వారిలో ఒకరికి 66 ఓట్లు, ఇద్దరికి 65 ఓట్లు, మరో ఇద్దరికి 64 ఓట్లు, ఇంకో ఇద్దరికి 60 చొప్పున ఓట్లు రావడం విశేషం. మరోవైపు వైసీపీకి 43 మంది కార్పొరేటర్ల బలం ఉన్నప్పటికీ ఆపార్టీ నుంచి పోటీచేసిన అభ్యర్థుల్లో బిపిన్‌జైన్‌కు 21, కరజాడ వెంకట నాగశశికళకు 25, పల్లా అప్పలకొండకు 32, ముర్రువాణికి 36, తోటపద్మావతికి 36, మహ్మద్ ఇమ్రాన్‌కు 36 ఓట్లు వచ్చాయి. ఆ పార్టీ నుంచి పోటీచేసిన సాడి పద్మారెడ్డికి మాత్రమే గరిష్టంగా 42 ఓట్లు పడ్డాయి. దీనినిబట్టి వైసీపీ కార్పొరేటర్లు కూటమి అభ్యర్థులకు ఓటేసినట్టు తేటతెల్లమైంది.

వైసీపీ నేతల ఆందోళన

కూటమి అభ్యర్థులకు పోలైన ఓట్లలో 14 బ్యాలెట్ పేపర్లపై పెన్ను, పెన్సిళ్లతో ప్రత్యేకంగా కోడ్ వేసి ఉన్నాయంటూ వైసీపీ నేతలు అభ్యంతరం వ్యక్తంచేశారు. బ్యాలెట్‌పత్రాలపై పెన్ను, పెన్సిళ్లతో ఎలాంటి గీతలు ఉండకూడదని, ఒకవేళ అలా ఉంటే వాటిని చెల్లని ఓట్లుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనికి అధికారులు ససేమిరా అనడంతో ఓట్ల లెక్కింపు కేంద్రం బయట ఆందోళనకు దిగారు. అప్పటికే జీవీఎంసీ కార్యాలయం ఆవరణలో ఉన్న డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, మొల్లి అప్పారావు, పల్లా దుర్గారావు అధికారులు నిబంధనలను పక్కనపెట్టి అధికారపార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. వారంతా కమిషనర్ పోర్టికో వద్ద బైఠాయించి పోలీసులకు, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. దీంతో పోలీసులు జోక్యంచేసుకుని ఆందోళన విరమింపజేసేందుకు యత్నించినా, తమకు కమిషనర్ వివరణ ఇవ్వాలని పట్టుబట్టడంతో ఏసీపీ సీహెచ్ వివేకానంద కమిషనర్ సంపత్‌కుమార్ వద్దకు వారిని తీసుకెళ్లారు. నిబంధనల్లో ఎక్కడా పెన్ను, పెన్సిల్, రహస్యకోడ్ ప్రస్తావనగానీ లేనందున, వాటిని చెల్లనిఓట్లుగా ప్రకటించడం సాధ్యం కాదని ఆయన వివరించారు. అయినప్పటికీ సంతృప్తి చెందక ఆందోళన కొనసాగించడంతో పోలీసులు వారిని బలవంతంగా బయటకు తరలించారు.



సరియా జలపాతం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అనుమతులు వద్దు

- సరియా జలపాతం వద్ద గిరిజనుల నిరసన

దేవరాపల్లి, ఆగస్టు 7 దేవరాపల్లి : సరియా జలపాతం ప్రాంతంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే తమ బతుకులు బుగ్గిపాలు అవుతాయని జలపాతం వద్ద బుధవారం గిరిజనులు నిరసన తెలిపారు. దేవరాపల్లి మండలం నగరంపాలెం, అనంతగిరి మండలం సరియా జలపాతం సరిహద్దుల్లో దట్టమైన అటవీ ప్రాంతంలో అదానీ కంపెనీ హైడ్రో పవర్ ప్లాంటు ఏర్పాటు చేయడం తగదన్నారు. అటవీ శాఖ అధికారులు అదాని కంపెనీకి అనుకూలంగా సర్వేలు చేస్తోందని, అదే జరిగితే ఇక్కడి గిరిజనులు అన్యాయమై పోతారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర అన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే అదాని కంపెనీ ఏజెంట్లు ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించారని ఆరోపించారు. హైడ్రో పవన్ ప్రాజెక్టుతో దేవరాపల్లి మండలం కొండ కొడాబు, వాలాబు, అల్లూరి జిల్లా అనంతగిరి మండలం సరియా, మాకనాపల్లి, దాయర్తి, మద్రేబు గ్రామాలతో పాటు చీడికాడ మండలం కోణాం గ్రామాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. అందుకే అటవీ అధికారులు ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వరాదని, ఈ పనులు చేపట్టరాదంటూ గిరిజనులు నినాదాలు చేశారు. పోడు చేస్తే కేసులు పెట్టే అటవీశాఖ అధికారులు, బడా కంపెనీలకు ఏ విధంగా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, రాముడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

- చోడవరం డివిజన్ వ్యవసాయ ఏడీ రవీంద్రనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ రవీంద్రనాథ్

బుచ్చెయ్యపేట, ఆగస్టు 7 : ఆధునిక పద్ధతులు పాటించడం అధికారుల సలహాలు, సూచనలను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చోడవరం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు వి.రవీంద్రనాథ్ అన్నారు. ఆయన బుధవారం బంగారుమెట్టలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. ఉత్తమ సాగు పద్ధతుల వల్ల రైతులకు వ్యయప్రయాసలు తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో భాస్కరరావు, వీఏఏ కుమారి బ్లెస్సీ, రైతులు సాయం రఘునాథ్, దొండా శ్రీను, బత్తుల శ్రీను, దొండా వెంకటరమణ, సాయం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ రాజేంద్రబాబు

చోడవరం, ఆగస్టు 7 : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఇ.రాజేంద్రబాబు సూచించారు. బుధవారం స్థానిక గాంధీగ్రామం ప్రభుత్వ హైస్కూల్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై తప్ప మరెలాంటి విషయాల్లోనూ పట్టించుకోకూడదన్నారు. ముఖ్యంగా డ్రగ్స్‌కు అలవాటు పడితే తమ జీవితంతో పాటు కుటుంబ ప్రతిష్ఠను దెబ్బ తీసిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం పాండురంగారావు, అడ్వకేట్ ఆర్ఎస్‌పీ నాయుడు, ఎస్ఐ శేఖరం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ



పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సత్యంనాయుడు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 7 : గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేటలో బుధవారం పలువీధుల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ పందిరి సత్యంనాయుడు, పంచాయతీ కార్యదర్శి కిరణ్మయి పనులను పర్యవేక్షించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారాలను తొలగించారు. అనంతరం కాలువల్లో పూడికలు తీసి బ్లీచింగ్ చల్లారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మువ్వల బుజ్జి, రమణ, జనసేన నాయకులు శివాజీ, ప్రసాద్, ఈర్నీ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సభ్యులు సమాచారం ఇవ్వాలి

బుచ్చెయ్యపేట/ చోడవరం, ఆగస్టు 7 : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలోని (పీఏసీఎస్) సభ్య రైతులు తమ సమాచారాన్ని అందించాలని వడ్డాది పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ పైడి రవి, కార్యదర్శి ఎన్.శాంతి కోరారు. భూమి పాస్ పుస్తకం, 1-బి, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫాన్ కార్డు, నామినీఆధార్‌కార్డు జెరాక్స్‌లతో పాటు ఫోన్ నెంబరు, రెండు పాస్ ఫొటోలను పీఏసీఎస్ పని చేసే సమయాల్లో సిబ్బందికి అందించాలన్నారు.

చోడవరం : సహకార సంఘాల్లోని సభ్య రైతులు తమ పూర్తి వివరాలు పాస్‌పుస్తకం, నామినీ వివరాలతో పాటు ఆధార్ కార్డు, పాస్ పోర్టుసైజ్ ఫొటోలు వన్‌బీ వివరాలు అందించాలని మండలంలోని లక్కవరం, గవరవరం, చీడికాడ సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జి ఎ.పద్మజ కోరారు. సంఘాల సభ్యుల వివరాలు కంప్యూటరీకరణ నిమిత్తం సభ్య రైతులు ఈ వివరాలు ఆయా సంఘాలలో ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పాఠశాల ఎన్నికలు వాయిదా

మాడుగుల/ చీడికాడ, ఆగస్టు 7 : ఈ నెల 8న జరిగాల్సిన పాఠశాల కమిటీ ఎన్నికలు వాయిదా వేసినట్టు మాడుగుల, చీడికాడ మండల విద్యాశాఖాధికారులు దేముడమ్మ, కె.బొంజుబాబు వేర్వేరుగా తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి ఎస్ఎంసీ కమిటీలను ఏర్పాటుకు ఏర్పాట్లు సిద్ధం చేశామని, అయితే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున ఎస్ఎంసీ కమిటీల ఏర్పాటును వాయిదా వేసినట్టు చెప్పారు.

వికసించిన బ్రహ్మకమలం



దేవరాపల్లి, ఆగస్టు 7 : మండల కేంద్రంలో రాజుల వీధిలో కాద కృష్ణకుమారి పెరట్లో బ్రహ్మకమలం పుష్పం మంగళవారం రాత్రి వికసించింది. శ్రావణ, భాద్రపద మాసాల్లో ఏడాదికి ఒకసారి పూసే బ్రహ్మకమలం శివుడికి ప్రీతి పాత్రమైన పుష్పంగా పురాణాల్లో చెబుతారు. ఈ పుష్పం రాత్రి పది తరువాత వికసించి తెల్లవారేలోపు ముడుచుకుపోతుంది. బ్రహ్మకమలం వికసించిన సమయంలో ప్రకాశవంతంగా ఉండడంతో పాటు సువాసన వెదజల్లుతుంది.

ఖండివరంలో వైద్య శిబిరం

చీడికాడ, ఆగస్టు 7 : మండలంలోని ఖండివరంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా చీడికాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 25 మందికి చీడికాడ వైద్యాధికారి శ్రీనివాసరావు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు, హెల్త్ అసిస్టెంట్ పేరునాయుడు, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, ఆశవర్కర్లు సేవలు అందించారు.

ముక్తినాథ్ క్షేత్రాల్లో 16 నుంచి యాగం



చోడవరం, ఆగస్టు 7 : వేదనారాయణ ఆశ్రమం ఆధ్వర్యంలో వచ్చే నెల 16 నుంచి 20 వరకూ నేపాల్ ముక్తినాథ్,బదరీనాథ్ క్షేత్రాల్లో అష్టాక్షరీ లక్ష్మీనారాయణ యాగం నిర్వహించనున్నట్టు వేదనారాయణ ఆశ్రమం ట్రస్ట్ వ్యవస్థాపకులు సుదర్శన సీతారామాచార్యులు తెలిపారు. ముక్తినాథ్ క్షేత్రాల్లో నిర్వహించే ఈ యాగంలో భక్తులు పాల్గొనాలని సుదర్శన సీతారామాచార్యులు విజ్ఞప్తి చేశారు.

సుప్రీంకోర్టు తీర్పుపై దళిత నేతల హర్షం

మాడుగుల, ఆగస్టు 7 : ఎస్సీల్లో ఏబీసీడి వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై దళితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాడుగుల బస్టాండ్ ఆవరణలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఏబీసీ వర్గీకరణ పోరాట యోధుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు ఎంఎం దాసు, ఎల్.సుందర్రాజు, సుబ్బారావు, జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో వీధికుక్కల బెడద

నాతవరం, ఆగస్టు 7 : మండల కేంద్రంతో పాటు మండలంలో వివిధ పంచాయతీల్లో రోజురోజుకు వీధికుక్కల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏ వీధిలో చూసినా వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తుండడంతో మహిళలు, పిల్లలు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. అలాగే పాఠశాలలకుతమ పిల్లలను పంపేటప్పుడు వీధికుక్కల బారిన పడకుండా దగ్గరుండి పంపవలసివస్తోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే రాత్రి వేళల్లో 8 గంటలు దాటితే ద్విచక్ర వాహనాలను వీధికుక్కలు వెంబడిస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.వీధికుక్కలు కరవటంతో రాబిస్ వ్యాక్సిన్ల కోసం ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోందని ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నాతవరం మండలంలో వీధికుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.